# లత & లాల్

## టెంపోరావ్

భర్త పీటమీద కూర్చున్నాడు. ముందున్న కంచంలో మంచిమంచి పదార్థాలున్నాయి. తెల్లటి నెల్లూరు బియ్యపు అన్నం. వంకాయ కూర. దోసకాయపచ్చడి. కంచం పక్కన ఒకచిన్న ప్లేట్లో పప్పుపులుసు. కోమల వంగి నెయ్యి వడ్డించింది. విజయకుమార్ పదార్థా లన్నింటినీ క్షణకాలం కోడిలా కెలికాడు. ఒకముద్ద నోట్లోపెట్టుకుని ఆకలిలేనట్టు భార్య వైపు చూస్తూ, ''పెరుగు పట్రా,''అన్నాడు.

కోమల బాధతో పెరుగుకప్పును అతని ముందుంచింది. పెరుగు పోసుకుని అతను పసిపాపలా తింటున్నాడు.

కోమల సమీపంలో నిలబడి అతడ్నే చూస్తూ వుండిపోయింది. గత పదిహేను రోజుల్నించీ అతడు తృప్తికరంగా భోం చేయడం మానేశాడు. అతడికి ఎంతో ఇష్ట మయిన పదార్థాలనుకూడా వేళ్ళతో కెలికి వదిలేస్తున్నాడు. తనతో ముభావంగా ఉంటు న్నాడు. కారణం ఏమిటి?

విజయకుమార్ తొందరగా బాత్‌రూమ్ లోకి వెళ్లాడు. చెయ్యి కడుక్కుని వంట గదిలోకి వచ్చాడు. ఆమె నేప్‌కిన్ అందించ బోయింది. అత నామెవైపు చూడలేదు. పడగ్గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని హేండ్‌బాగ్ చేత్తో పట్టుకుని వీధిగుమ్మం దాటాడు.

"కోమలా, ఆఫీసుకి వెళ్తున్నాను. తలు పేసుకో," అని అనడం మానేశాడు.

కోమల వీధిగుమ్మం వద్దకు నడిచింది. బయట నిలబడి రోడ్డుమీదకు చూసింది. విజయకుమార్ నీరసంగా అడుగులేస్తున్నాడు. పొడుగ్గా సన్నంగా వుంటాడు. కెనడీక్రాఫ్, లూజ్‌పాంటు, లూజ్‌స్లాకు. ఎడంచేతికి ఇరవై ఏళ్ళక్రితం కొన్న రిస్టువాచీ. కాళ్ళకు సింగపూర్ స్లిపర్స్. అతని వయస్సు నలభై ఏళ్ళుంటుంది. మొదటిభార్య చనిపోయాక పేదింటి పిల్లయిన కోమలని పెళ్ళాడాడు. పి. యు. సి. పాసయి కోమల చదువు మానే సింది. ఆమెకు ఇరవైయేళ్ళు ఇంకా నిండ లేదు.

గుమ్మం బయట నిలబడ్డ కోమలకి ఇప్పుడు విజయకుమార్ రూపం కనపడ్డం లేదు. కోమల ఎదురింటి వైపు చూసింది. ఒక యువకుడు బయటకొచ్చి రోడ్డుమీద నిలబడ్డాడు. ఎదురుగా వున్న ఆమెవైపు సూటిగా చూస్తున్నాడు. అతని చూపును గమ నించి కోమల ఇంట్లో కొచ్చి తలుపు మూసు కుంది. మెల్లిగా కిటికీవద్దకు వెళ్ళింది. కర్టెన్ కొంచం పక్కకు తొలగించి చూసింది.

ఇంకా ఆ యువకుడు అక్కడే వున్నాడు. టైట్ పాంట్ మూలంగా అవయవాల వంపులు స్పష్టంగా అవుపిస్తున్నాయి. కోమల కర్టెన్ మూసేసింది. దినపత్రిక పట్టుకుని పడకగదిలోకి వెళ్ళింది. పరుపుమీద వాలింది. పైన ఫాన్ తిరుగుతోంది. దినపత్రిక పేజీ లను కోమల తిరగేయ సాగింది. రెండో పేజీలో వున్న ఒక ప్రకటనమీద ఆమెదృష్టి కేంద్రీకృతమైంది. ఆ ప్రకటనలో ఇలా వుంది :

మీకు ఎటువంటి సమస్యలున్నా, ఏ బాధ లున్నా గాబరాపడకండి. మమ్మల్ని కలుసు కోండి. వెంటనే విముక్తి చేకూరుతుంది.

లత అండ్ లాల్, ప్రైవేట్ డిటెక్టివ్స్
7 టాంక్ రోడ్డు, మద్రాసు – 4.

కోమల ఆ ప్రకటనను పదేపదే చదు వుతూ వుండిపోయింది. తన కొక సమస్య వుంది. తన జీవితం బాధాకరంగా సాగు తోంది. లత అండ్ లాల్ – వీ ళ్ళిద్దరూ తనకేదైనా సహాయం చెయ్యగలరా? వెళ్ళి కలుసుకుంటే మంచిదేమో!

మధ్యాన్నం మూడుగంటలు దాటింది. బయట ఎండగా వుంది. కోమల ఇంటికి తాళంవేసి రోడ్డు చేరుకోగానే దొరికిన ఆటో రిక్షాలో కూచుంది. టాంక్ రాగానే దిగింది. టాంక్ రోడ్డు ఎక్కడుందో కనుక్కుంది. / ఇంటిముందు ఆగింది. మూడంతస్థుల భవనం. పై అంతస్థులో లత అండ్ లాల్ బోర్డు పెద్ద అక్షరాల్లో కనిపిస్తోంది. కోమల మేడమెట్లు ఎక్కింది. మూడో అంతస్థు చేరుకుంది. తలుపులు బార్లా తెరిచివున్నాయి. ఒకేగది. పేపర్ ప్రకటన చూసి ఇదేదో పెద్దకంపెనీ అయుంటుందని కోమల అను కుంది. వుడెన్ టేబుల్ వెనుక ఒక స్త్రీ కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తలానించి నిద్రిస్తోంది. కోమల లోపలకు వెళ్ళింది. ఒక యువకుడు పాతబడ్డ కేన్ సోఫాలో పడుకుని ఎదురుగావున్న స్టూల్‌మీద కాళ్లు చాచు కున్నాడు. టేబుల్‌మీద టెలిఫోన్ వుంది. కోమలకు ఏం చెయ్యాలో తోచక వెనక్కు వెళ్ళి తలుపుమీద తట్టింది. నిద్రిస్తూన్న స్త్రీ ఉలిక్కిపడి లేచింది. యువకుడు స్టూల్‌మీద నుంచి కాళ్లుతీసి కేన్ సోఫాలో మెలుకువగా

కూర్చున్నాడు. కుర్చీలో కూర్చున్న స్త్రీ కోమలవైపు నవ్వుతూ చూసింది. పొట్టిగా, మహా లావుగా వుందామె.

"నాపేరు లత. అతను లాల్. మేమిద్దరం ఈ కంపెనీలో పార్ట్నర్స్. మీకేం కావాలి?" అడిగిందామె.

కోమల టేబుల్‌వద్దకు వెళ్ళి నిలబడింది. లాల్ తనముందున్న స్టూల్‌ని తన్నాడు. అది లత టేబుల్ ముందాగింది.

"ఆ స్టూలుమీద హాయిగా కూర్చుని ఏం కావాలో చెప్పండి!"

కోమల స్టూలుమీద చతికిలబడింది. లత వైపుచూస్తూ వుండిపోయింది.

"తొందరగా చెప్పండి. ముక్కుసూటిగా చెప్పాలి. టైమ్ యీజ్ మనీ. ఒక్కనిమిషాన్ని వృథాచెయ్యడానికి వీలులేదు," అంది లత.


"నాపేరు కోమల. నా భర్త విజయకుమార్. ఆయనకు నలభైయేళ్ళవయస్సుంటుంది. ఆయనది రెండోపెళ్ళి. అయినా ఆయన్నెంతో ప్రేమగా చూస్తున్నాను. గత పదిహేనురోజుల్నించీ ఆయన సరిగా తినడంలేదు. నిద్రపోవడంలేదు. నాతో హుషారుగా మాట్లాడటం మానేశారు. ఆయ నిలా ఎందుకున్నారో నాకు అర్థం కావడంలేదు. కారణం మీరు కనుక్కొని, చెయ్యవలసింది చేసి, మా జీవితం మునుపటిలా వుండేటట్టు చూడాలి," అంది కోమల.

"ఇదెంతపని? రెండు మూడు రోజుల్లో అంతా సరిదిద్దుతాం," అంది లత.

లాల్ సిగరెట్ వెలిగించి అగ్గిపుల్లను జోరుగా విసిరాడు. దురదృష్టవశాత్తూ అది లత కొప్పుకి ఇరుక్కుంది. ఆమె అమాంతంగా కుర్చీలోంచి లేచి, "యూఫూల్!" అంటూ అగ్గిపుల్లను అతని మీదకు ఎగరేసింది.

"రెండు యాష్‌ట్రేలు కొని పడెయ్యమని మూడు నెల్లనుంచి మొత్తుకుంటున్నాను. యూఆరే మైజర్!" అరిచాడు లాల్.

అతని మాటలను లత వినిపించుకోలేదు.



"మిస్ కోమలా..." లత ఏదో చెప్పడం ప్రారంభించింది.

"నాకు పెళ్ళయిందని మొదటే చెప్పాను," అంది కోమల.

"అయామ్ సారీ, చిన్న విషయాలు మర్చిపోతుంటాను."

"లతగారూ, పెళ్ళి చిన్న విషయంకాదు, పెద్దది."

"ఎవరి పెళ్ళి వాళ్ళకు పెద్దవిషయం కావచ్చు. కాని లోకానికి చిన్నది. ఇన్‌సిగ్నిఫికెంట్! మిసెస్ కోమలా, మాది పార్ట్నర్‌షిప్ కంపెనీ అవడంవల్ల మీకోసం గంట పనిచేస్తే ఇరవై రూపాయలు తీసుకుంటాం."

"నా సమస్యను పరిష్కరించడానికి మీకెన్నిగంటలు పడుతుంది?"

"లాల్ నువ్వేమంటావు?" అడిగింది లత అతనివైపు చూస్తూ.

"వెంటనే రెండు యాష్‌ట్రేలు కొనమంటాను," అన్నాడు లాల్ సిగరెట్ పీకను పైకి విసురుతూ.

మొగ్గలేస్తూ సిగరెట్ పీక లతటేబుల్ మీద పడింది. ఆమె కోపంగా లాల్‌వైపు చూసింది.

"యూ ఫూల్, కింగ్ అండ్ కంపెనీ వాళ్ళిచ్చిన చెక్కు కాలిపోతుంది!" అరిచింది లత.

"ఫైరింజన్‌కి ఫోన్‌చెయ్యి!" అన్నాడు లాల్.

లత పొడుగాటి గోరుతో కారమ్స్ అడినట్టు సిగరెట్ పీకను కొట్టింది. అది వెళ్ళి గుమ్మం అవతల పడింది. అప్పుడే జోళ్ళు రిపేర్‌కిచ్చి ఆఫీసుకి తిరిగొస్తున్న లాయర్ క్రిష్ణయ్యర్ కుడికాలు అప్రయత్నంగా ఆ పీకమీద పడింది. అరికాలు చుర్రుమంది. కారణం ఏమిటో తెలియని క్రిష్ణయ్యర్ "కడవలే!" అని అరిచి అరిచి కాలెత్తాడు. కాలుతున్న సిగరెట్ పీకవైపు కోపంగా

చూశాడు. లత అండ్ లాల్ ఆఫీసు తలుపు మీద మోచేత్తో తట్టాడు. లత గుమ్మంవైపు చూసింది.

"కమిన్ ప్లీజ్!" అరిచిందామె, మరో క్లయింట్ అనుకొని.

"మీ గదిలోకి ఎవరొస్తారు? గదిముందు కాళ్లు మాడుతున్నాయి. గదిలోకొస్తే శరీరం కూడా మాడుతుందేమో!" అన్నాడతను.

లత అర్థంకానట్టు లాల్‌వైపు తిరిగింది.

"లాల్, ఆయన చెప్పేదేమిటి?"

"రెండు యాష్‌ట్రేలు కొని ఆఫీసులో పెట్టమంటున్నాడు. ఆయన కాలు కాలింది," అన్నాడు లాల్.

"కాలలేదు, మాడింది," అన్నాడు క్రిష్ణయ్యర్.

"ఐయామ్ సారీ," అంది లత.

"సారీ అంటే కోర్టు ఒప్పుకోదు," అని విసుక్కుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు లాయర్ క్రిష్ణయ్యర్.

కోమలకి ఈ ఆఫీసంతా విచిత్రంగా అపుపించింది. వీళ్ళ కేదేనా పనప్పజెప్తే తన సమస్య పరిష్కారం కాకపోగా మరికొన్ని సమస్యలు ఎదురవ్వొచ్చు! స్టూల్‌మీదనుంచి లేచింది.

"లతగారూ, నే వెళ్ళొస్తాను. నా విషయంలో మీరేమాత్రం శ్రమపడొద్దు. నా సమస్య దానంతటదే సర్దుకుంటుంది," అంది కోమల.

"కోమలా, దయచేసి కూర్చోండి. లాల్‌ని లెక్కచెయ్యకండి. ఈ కంపెనీకి నేను మానేజింగ్ పార్టనర్‌ని. ఈ నాలుగ్గోడల మధ్యా నేను చెప్పిందే వేదం. లాల్ పైకి అల్లరిగా అవుపించినా చాలా శక్తున్న మనిషి. క్షణంలో ఎంత రహస్యాన్నైనా కనుక్కొని జయప్రదంగా తిరిగొస్తాడు," అంది లత.

లాల్ సంతోషంగా కాలుమీద కాలేసుకుని కూర్చుని ఠీవిగా కోమలవైపు చూశాడు. కోమల మళ్లా చతికిలబడింది.

"కోమలా, మీరు కూడా పర్సుతెచ్చారా?"

"తేలేదు."

"మా ఆఫీసుకి ఉట్టిచేతుల్తో వచ్చారా?"

"జేబు రుమాల్లో కొంత డబ్బు మూట కట్టాను."

"మూటివ్వండి. ఇరవై రూపాయలు అడ్వాన్స్ ఇవ్వండి. పనయ్యాక బిల్లు పంపిస్తాను. ఇరవైనాలుగ్గంటల్లో మా బిల్లు చెల్లించాలి. అటుపైన ఆలస్యం అయితే పన్నెండు పర్సంట్ వడ్డీ ఇవ్వాలి."

"అంత డబ్బు నాదగ్గర లేదు."

"ఎంతుంది?"

"పదిరూపాయలుంది."

"అది అడ్వాన్సుగా ఇవ్వండి!" అంది లత.

"ఆ డబ్బుతో రెండు యాష్‌ట్రేలు వెంటనే కొనొచ్చు" అన్నాడు లాల్.

కోమల పదిరూపాయల నోటును లత కందించింది.

"ఇప్పుడు నాదగ్గర చిల్లిగవ్వ లేదు. ఇంటికి నడిచిపోవాలి," అంది కోమల.

"నడవడం దేనికి? తులసింగం రిక్షాలో వెళ్ళండి."

"ఎవరతను?"

"మా ఆఫీసుముందు వుంటాడు. అతడికి లైసెన్స్ లేదు. మహా మంచివాడు. డాల్డాలాంటి హృదయం. ఎక్కడికి కావల్సినా తీసుకెళ్తాడు. మన చేతిలో డబ్బుంటే ఇవ్వొచ్చు. లేకపోతే రేపిస్తాం అనొచ్చు. రేపు రేపంటూ సంవత్సరందాకా ఈడ్చుకుపోవచ్చు. నేనెప్పుడూ అతని రిక్షాలోనే ఆఫీసుకొస్తాను, ఇంటికెళ్తాను," అంది లత.

కోమల లేచి నిలబడింది.

"మీ సలహా పాటిస్తాను. మా ఇంటి నంబర్ 10, రాయప్ప మొదలీ స్ట్రీట్, రాయపేట."

కోమల మెల్లిగా బయటకు వెళ్ళిపోయింది. లత లాల్ వైపు చురచుర చూసింది.

"నువ్విలా అల్లరిగా ప్రవర్తిస్తే నా క్లైంట్స్ అందరూ కాకుల్లా ఎగిరిపోతారు," అంది లత.

"వాళ్ళందరూ ఎగిరిపోవడమే మంచిది. నేను వీధులమ్మట ఎండలో మాడుతూ తిరగక్కర్లేదు," అన్నాడు లాల్.

"లాల్, నువ్వు వెంటనే బయల్దేరు. రంగంలోకి దూకు. కోమల చాలా అందంగా వుంది. కోరుకుని రెండోపెళ్ళి చేసుకున్న భార్యను నిర్లక్ష్యం చేసి, తిండిమాని నలభైయేళ్ళ మొగుడు ఎందుకలా వున్నాడు?"

"నా కింకా మొదటిపెళ్ళే కాలేదు. రెండోపెళ్ళి చేసుకున్న భర్తలు ఎందుకలా వుంటారో ఊహించడం కష్టం," అన్నాడు లాల్.

"లాల్, నీకు బ్రెయిన్స్ నేను సప్లయి చేస్తాను. నువ్వు శరీరాన్ని తిప్పితేవాలు. మనం జయిస్తాం." అంది లత.

లాల్ నవ్వుకున్నాడు. ఆమె బ్రెయిన్‌లో వున్న మట్టితో అరడజను నూతులను కప్పెట్టేయొచ్చు! సిగరెట్ వెలిగించి అగ్గిపుల్లను కోపంగా విసిరాడు. లత చటుక్కున టేబుల్‌కిందకు తలదూర్చి అగ్గిపుల్ల మరెక్కడో పడ్డ శబ్దం వినిపించగానే లేచి కూర్చుంది.

"షూట్, అంటే వెంటనే వెళ్ళు." అందామె.

"బస్ ఖర్చులకి డబ్బు కావాలి."

"ఎంతకావాలి?"

"కనీసం అయిదు రూపాయలు."

"నీ అంచనాలనుపాటిస్తే లోకం దివాలా తీస్తుంది. ఇదిగో ఒక రూపాయి తీసుకో. గొంతుకెండుకుపోయినప్పుడు టీ తాగు. అయిస్‌వాటర్‌కంటే దేహానికి మంచినీళ్ళు శ్రేయస్కరం. తులసింగం రిక్షాలోవెళ్లు."

"సగం దూరం వెళ్ళాక రిక్షాలో వాడు కూర్చుని నన్ను లాగమంటాడు," అన్నాడు లాల్.

"లాల్, బియె గుడ్‌బాయ్! రాక రాక వారం రోజులకి ఒక కేస్ వచ్చింది. ఏదో చెయ్! ఈ లోపల కోమలనుంచి ఎంత డబ్బు గుంజొచ్చో నేను ఆలోచిస్తూ వుంటాను."



లాల్ రూపాయి జేబులోవేసుకుని ఈల వేస్తూ మేడమెట్లమ్మట గబగబా కిందికి దిగాడు.

రోడ్డుమీదికి రాగానే తులసింగం ఎదురయ్యాడు.

"నీ రిక్షా ఎక్కడ?'' అడిగాడు లాల్.

"ఎవరో కపాలీటాంక్‌లోకి తోసేశారు, సార్. దాన్ని తాళ్ళుకట్టి ఒడ్డుకి లాగాలి. మీరు సహాయపడ్తారని వస్తున్నాను,'' అన్నాడు తులసింగం.

''మేడమీద ఆఫీసులో లతుంటుంది. ఆమె నెలాగో డోలీకట్టి కిందకు మోసుకురా. చెరువులోపడ్డ రిక్షాలను ఒడ్డుకి లాగడానికి ఆమె బరువు ఎంతైనావుపయోగిస్తుంది,'' అన్నాడు లాల్.

తులసింగం మెట్లెక్కాడు. లాల్ రోడ్డమ్మట నడవసాగాడు. కొంచం దూరంలో కొత్త స్కూటర్ అవుపించింది. స్కూటర్ పక్క నిలబడ్డ వ్యక్తిపైన బాల్కనీలో నిలబడ్డ ఆడపిల్లవైపు చూస్తున్నాడు.

''కొత్త స్కూటర్ తెచ్చాను. మీ అమ్మను తొందరగా బాల్కనీలోకి రమ్మను. చూస్తుంది,'' అరిచాడతను.

''అమ్మ తలంటుకుంటోంది నాన్నా,'' అంది అమ్మాయి.

''ఇంతా చచ్చీ చెడీ స్కూటర్ తెస్తే చూసే అవకాశంకూడా లేకుండా తలంటుకుంటుందా!" అని అతడు మేడమెట్లవైపు పరుగెత్తాడు.

లాల్ స్కూటర్ని నవ్వుతూ పరిశీలించాడు.

''అయిదువేలు సార్. ఎలావుంది?'' అడిగాడా వ్యక్తి బాల్కనీ నుంచి.

''ఇటువంటి స్కూటర్లు ఎంతో పలుకుబడి వుంటే కాని ఈ రోజుల్లో దొరకవు,'' అన్నాడు లాల్ పైకి చూస్తూ.

''సీటుమీద కూర్చొని చూడండి. స్పాంజి కంటె మెత్తగా వుంటుంది,'' అన్నాడతను.

లాల్ సీటుమీద కూర్చున్నాడు.

''స్టార్ట్ చేసి చూడండి. చడీచప్పుడు లేకుండా ఇంజను పనిచేస్తుంది,'' అన్నాడా వ్యక్తి.

అతడు పైనుంచి విసిరిన స్కూటర్ తాళం చెవిని లాల్ హుషారుగాపట్టుకున్నాడు. స్కూటర్ స్టార్ట్ చేసి ముందుకి పోనిచ్చాడు. వెనక్కు తిరిగి బాల్కనీలో నిలబడ్డ వ్యక్తికి టాటా చెప్పాడు.

''మీరెవరో నాకు తెలీదు. వెళ్ళిపోకండి.'' అర్చాడతను.

''మీ భార్య తలంటు పూర్తయ్యే లోపల తిరిగి వస్తాను,'' అన్నాడు లాల్.

స్కూటర్ రోడ్డమ్మట దూసుకుపోయింది.

## 2

రాయప్ప మొదలీ స్ట్రీట్ చేరుకున్నాడు లాల్. పదో నంబరు ఇంటి పక్కనే ఒక సిగరెట్ షాపుంది. లాల్ ఒక చార్మినార్ పాకెట్ కొని సిగరెట్ వెలిగించాడు. పరిసరాలను పరిశీలిస్తూ నిలబడ్డాడు. పదో నంబరు ఇంటి కెదురుగా ఒక యిల్లుంది. ఒక స్టూడెంట్ ముందు వరండాలో నిలబడి కొంగ జపం చేస్తున్నాడు. అప్పుడప్పుడు అతని చూపు పదో నంబరు యింటి మీదికి ప్రసరిస్తున్నదని లాల్ గ్రహించాడు. గబగబా పక్కనున్న యింటి వైపు నడిచాడు. ఊచల తలుపులు లోపల్నించి మూసి వున్నాయి. మెల్లిగా తలుపుమీద తట్టాడు. కోమల గబగబా వచ్చి తలుపు తీసింది. లాల్ వెనక్కు తిరిగాడు. ఎదురుగా వున్న విద్యార్థి ఇప్పుడు ఆందోళనతో చూస్తున్నాడు.

''అలా కూర్చోండి!''

కేన్ సోఫాలో లాల్ చతికిలబడ్డాడు. కోమల పరుగెత్తు కెళ్ళి కిటికీలో వున్న యాష్ట్రే తెచ్చి అతని ముందున్న గుండ్రటి బల్లమీద పెట్టింది. లాల్ నవ్వుతూ ఆమె వైపు చూశాడు.

''మీ భర్త ఎప్పుడొస్తారు?''

''అయిదున్న రవుతుంది.''

''నేను ఆ టైమ్‌లో వస్తాను. నన్ను పలకరించకండి. నే నెవరో తెలియనట్లు నటించండి.''

కోమల తలాడించింది. లాల్ బయటకు కదిలాడు. స్కూటర్ మీద కూచుని ముందుకి పోనిచ్చాడు. వెనకనుంచి విద్యార్థి విజిల్ విచిత్రంగా వినిపించింది.

అయిదున్న రయింది. లాల్ వేషం విచిత్రంగా వుంది. తెల్లటి ఫ్రేమున్న కళ్ళద్దాలు. చేతిలో బాగ్ వుంది. ఫుల్ సూటు ధరించాడు. వయస్సులో పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. పదో నంబరు ఇంటి తలుపు తోసుకుని, ''మే ఐ కమిన్?'' అంటూ లోపలకు అడుగుపెట్టాడు.

విజయకుమార్ అతనివైపు ప్రశ్నార్థకంగా చూశాడు. గుండ్రటి టేబుల్‌మీద ఉప్మా ప్లేటుంది. ఉప్మా అతను తినలేదని లాల్ గ్రహించాడు. ఈగలు జెట్ ప్లేన్స్‌లా ప్లేటుచుట్టూ తిరుగుతున్నాయి. పక్కనే గ్లాసులో వున్న కాఫీ చల్లారిపోతోంది.

"ఎవరు మీరు?" విజయకుమార్ అడిగాడు.

"నా పేరు మీనన్. యూ.ఎన్.ఎస్.కో. ఇంటర్‌నేషనల్ కమీషన్ తరఫున పని చేస్తున్నాను. ఇప్పుడొక సర్వే మేము సాగిస్తున్నాం. మీ సహాయం కావాలి,'' అన్నాడు లాల్.

''దేనికి?''

లాల్ బాగ్ తెరిచాడు. ఒక నోట్‌బుక్‌ను బయటకు లాగాడు, "చూశారా? పెళ్ళిళ్ళకు ఈడూ జోడూ కావాలంటారు. కాని అనేక మంది రెండుమూడుసార్లు పెళ్ళిళ్ళు చేసుకుంటూవుంటారు. అప్పుడు, వయస్సులో బాగా వ్యత్యాసముంటుంది. అటువంటి భార్యాభర్తల జీవితాలు ఎలా సాగుతున్నాయో మేము సర్వే చేస్తున్నాం. మీ పేరు విజయకుమారని మా రికార్డులో వుంది. మీకు రెండో పెళ్ళి అయింది. మీ భార్యకంటె మీకు ఇరవై ఏళ్ళ వయస్సెక్కువ. మీ జీవితం ఎలా సాగుతోంది? దయచేసి జవాబివ్వండి!"

విజయకుమార్ జవాబివ్వలేదు. లాల్ ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

"ఏదీ దాచొద్దు. నిజం చెప్పండి. మీరేం చెప్పినా రహస్యంగా వుంచబడుతుంది."

"జీవితం ఆనందంగా లేదు," అన్నాడు విజయకుమార్.

"మీ భార్య మిమ్మల్ని ఏ విధంగానైనా బాధిస్తోందా?"

"అలా అనను."

"అయితే మీకు బాధ ఎలా కలుగుతోంది?"

"అది చెప్పడం కష్టం. ఒక ఊళ్లో ఒక షావుకా రున్నాడు. అతనివద్ద పదిలక్షలు రొక్కంగా మూలుగుతోంది. అనుక్షణం ఆ డబ్బు ఏమవుతుందో అని అతను గాబరా పడుతూ వుంటాడు. అదొక బాధేగా?" అన్నాడు విజయకుమార్.

"రియల్లీ! మీ భార్య మిమ్మల్ని ప్రేమతో చూస్తుందా?"

"చూపుల్నిబట్టి హృదయంలో ఏముందో తెలుసుకోలేం."

"ఆఖరి ప్రశ్న. మీ రామెను అనుమానిస్తున్నారా?"

"నే నెవర్నీ నమ్మను," అన్నాడు విజయకుమార్.

థాంక్స్ చెప్పి, పుస్తకాన్ని లోపల పడేసి బాగ్ మూసి లాల్ పదో నంబరు ఇంట్లోంచి బయటకు కదిలాడు. ఎదురుగా వున్న ఇంటి వరండాలో విద్యార్థి అలాగే నిలబడి వున్నాడు. లాల్‌కి ఇప్పుడు స్కూటర్ లేదు. వాపసు చేసేశాడు. ఆలోచిస్తూ వీధమ్మట అడుగులేస్తున్నాడు. మెదడులో ఏదో మెరు

పులా మెరిసింది. లాల్ వెనక్కి తిరిగాడు. రోడ్డుదాటాడు. గబగబా నడిచాడు. కాస్సేపట్లో వరండాలో నిలబడ్డ విద్యార్థి ముందుకు వెళ్ళాడు.

"మిస్టర్, నీతో మాట్లాడాలి," అన్నాడు లాల్.

"చెప్పండి," అన్నాడు విద్యార్థి.

"నీ గదిలోకి పద."

విద్యార్థి గడపదాటి పక్కనున్న గదిలోకి వెళ్ళాడు. లాల్ అతడ్ని వెంబడించాడు. లోపల్నించి తలుపు దగ్గరగా మూశాడు. క్షణకాలం గదిని నలువైపులా చూశాడు. నేలమీద పరుపుంది. పరుపుమీద డజన్ సెక్స్ పత్రికలు విచ్చలవిడిగా పడున్నాయి. మాసిన గుడ్డలు గదిలో అక్కడక్కడ దొర్లుతున్నాయి. మూడుకాళ్ళమీద నిలబడ్డ కుర్చీని చూపించి విద్యార్థి లాల్‌ని కూర్చోమన్నాడు. లాల్ కూర్చోలేదు. విద్యార్థివైపు సూటిగా చూశాడు. బాగ్‌లోంచి పుస్తకాన్ని బయటకు తీశాడు.

"నీ పేరు ?" అడిగాడు లాల్.

"ప్రేమనాథ్."

"మిస్టర్ ప్రేమనాథ్, నువ్వు యాంటీ-కలరా-ప్లేగ్-డింగూ ఇంజక్షన్ తీసుకున్నావా ?"

"లేదు," అన్నాడు ప్రేమనాథ్.

"కార్పొరేషన్ హెల్త్‌సెంటర్ నుంచి వస్తున్నాను. ఇంజక్షన్ నీ కివ్వాలి," అన్నాడు లాల్ గంభీరంగా. కోటుజేబులోంచి పాత సిరంజిని బయటకు తీశాడు. సిరంజి నీడిల్ కంతాణీలా వుంది. ప్రేమనాథ్ సిరంజివైపు భయంతో చూశాడు.

"ఇంజక్షన్ ఎక్కడివ్వాలి ?"

"బొడ్డు ప్రాంతంలో," అన్నాడు లాల్.

"ప్లీజ్, ఈ ఇంజక్షన్ నా కొద్దు."

"వద్దనడానికి వీలులేదు. ఈ రాయపేట భాగం ప్లేగ్-కలరా-డింగూ వ్యాధులకు వశమైనట్లు కార్పొరేషన్‌వాళ్ళు ఎప్పుడో పత్రికలో ప్రకటించారు. అది నువ్వు చూసి వుండాలి."



"దయచేసి ఏదేనా విధానం చెప్పండి. ఇంజక్షన్ అంటే నాకు చిన్నప్పటినుంచీ భయం," అన్నాడు ప్రేమనాథ్.

"ఒకటే విధానం. ఈ రాయపేట వదిలేయి. గదిచూసుకుని ఏ రాయపురానికో వెంటనే బదలీ అవు !"

"రక్షించారు. వెంటనే అలాగే చేస్తాను."

"రేపు పొద్దుటే మళ్ళా వస్తాను. నువ్వు నా కంటికి కనిపిస్తే ఇంజక్షన్ ఇవ్వక తప్పదు," అన్నాడు లాల్.

లాల్ గబగబా గుమ్మంవైపు కదిలాడు.

"రోడ్డు కటువైపున్న పదో నెంబరు ఇంటివాళ్ళకి ఇంజక్షన్ ఇచ్చారా?" అడిగాడు విద్యార్థి.

"ఇవ్వలేదు! రేపు సాయంత్రంలోగా వాళ్లూ నీలాగే ఇల్లు ఖాళీచేస్తున్నారు," అని లాల్ వీధమ్మట గబగబా నడవసాగాడు.

* * *


రెండు రోజులు దాటిపోయాయి. మధ్యాన్నం మూడయింది. లతా అండ్ లాల్ ఆఫీసులోకి కోమల నవ్వుతూ అడుగుపెట్టింది. ఆమెను చూడగానే కాళ్లు చాచుకున్న స్టూలును లాల్ తన్నాడు. ఆ శబ్దానికి లత ఉలిక్కిపడుతూ లేచింది. కోమల స్టూలు మీద కూచుని లత వైపు సంతోషంగా చూసింది.

"ఏమిటీ చప్పుడు?" అరిచింది లత లాల్ వైపు కోపంగా చూస్తూ.

''మన వీధమ్మట ట్రాక్టర్ వెళ్ళింది,'' అన్నాడు లాల్.

''దానికింద నువ్వు పడితే సగం శని విరగడయి వుండేది,'' అని లత కోమల వైపు చూసి కళ్ళు చిట్లించి, ''మీరు గదిలో వున్నట్టు నేనింతవరకూ గుర్తించలేదు,'' అంది.

''లతగారూ, మీకు ధన్యవాదాలు. నా భర్త ఇప్పుడు మునుపటిలాగే వున్నారు.




హాయిగా భోంచేస్తున్నారు. కులాసాగా కబుర్లు చెబుతున్నారు. ఒక్క క్షణంకూడా నన్ను వదలడంలేదు.........''

''అదెంత పని? ఒక్క రోజులో పరిస్థితుల్ని తారుమారుచేస్తాం. ఎటువంటి సమస్యనైనా పరిష్కరిస్తాం. మా రేటు గంటకి ఇరవై రూపాయలు.''

''లతగారూ, మీకింకా నిద్రమత్తు పోలేదనుకుంటాను. నా పేరు కోమల. నేను చెప్పేది సమస్యను గురించికాదు. నా సమస్యను మీరు జయప్రదంగా పరిష్కరించారని అంటున్నాను.''

లత కళ్లు తుడుచుకుంది. తన బరువైన శరీరాన్ని కుర్చీలో మరో వైపుకి కదిల్చి కూచుంది.

''ఐయామ్ సారీ మిసెస్ కోమలా. మీరు మరో సమస్యని గురించి చెప్తున్నారని పొరబడ్డాను. మీ బిల్లు ఇదిగో. పది గంటలు పని చేశాం. రెండొందల రూపాయలు అయింది. పది రూపాయలు అడ్వాన్స్ పోగా 190 రూపాయలు వెంటనే కాష్ ఇవ్వండి.''

కోమల దీనంగా లత వైపు చూసింది.

''అంత డబ్బు నేను ఇవ్వలేను.''

''పది గంటలు నేను పని చెయ్యలేదు. కోమల సమస్యను రెండున్నర గంటల్లో పరిష్కరించాను,'' అన్నాడు లాల్.

''యూ ఫూల్, షటప్! నువ్విక్కడ్నించి వెళ్ళిపోతేకాని ఈ కంపెనీ వృద్ధిలోకిరాదు!'' అరిచింది లత.

''లతా, నీకు భర్తా పిల్లలూ లేరు. ఒంటరిగా జీవిస్తున్నావు. బాంకిలో అయిదు లక్షలు మూలుగుతోంది. ఇంకా డబ్బుకోసం ఎందుకలా పడి చస్తావు?'' అడిగాడు లాల్.

లత అతని ప్రశ్నకు జవాబియ్యలేదు.

''మిసెస్ కోమలా వంద రూపాయలకు రాజీ పడదాం,'' అంది లత.

కోమల తొమ్మిది పది రూపాయల నోట్లు తీసి లత కందించింది.

లత ఆ డబ్బును భద్రంగా హేండ్ బాగ్‌లో పడేసుకుంది.

కోమల స్టూల్‌మీద నుంచి లేచి గుమ్మం వైపు అడుగు వేసింది. లాల్ ఆమె వెనకనే వెళ్లాడు. నడవలో కోమల ఆగింది.

"మిస్టర్ లాల్, ఆయనలో అంత మార్పెలా వచ్చింది? మీ రేంచేశారు?"

లాల్ ఆఖరిదమ్ములాగి సిగరెట్ పీకను గదిలోకి విసిరాడు.

"యూ రాస్కెల్, బాస్టర్డ్..." లత అరుస్తోంది.

"ఎన్ని తిట్లైనా తిడుతుంది కాని యాష్ ట్రేలు మాత్రం కొనదు!" అన్నాడు లాల్. లాల్‌కు కోమలప్రశ్న జ్ఞప్తికొచ్చింది.

"మిసెస్ కోమలా, మీ భర్త విజయకుమార్ చాలా మంచిమనిషి. కాని ఆయనకి అనుమానం ఎక్కువ. ఆయ నెవర్నీ నమ్మరు. ఎదురింట్లోవుండే విద్యార్థి నీవైపు తరుచు చూస్తూవుండడం ఆయన గమనించారు. అప్పట్నించీ ఏం జరుగుతుందో అని బెంగెట్టుకుని, రోజూ అనుమానాన్ని పెంచుకుంటూ, మీకు దూర మయ్యారు!"

"ఆ అనుమానాన్ని మీరెలా తొలగించారు?"

"ఆ గదిని విద్యార్థి ఖాళీచేసి మరో చోటకు వెళ్ళిపోయాడు. దాంతో మీ భర్త మనస్సుకు శాంతి లభించింది," అన్నాడు లాల్.

కోమల అతనివైపు కృతజ్ఞతతో చూస్తూ మెట్లు దిగింది. లాల్ ఈలవేస్తూ అఫీసు గదిలోకి అడుగుపెట్టాడు.

''యూ ఆర్ సస్పెండెడ్!" అంది లత పిస్టల్ షాట్‌లా.

''మరోకేసు వచ్చిందాకా నన్ను సస్పెండ్ చేయడం నీకు మామూలేగా!'' అన్నాడు లాల్.